సాక్షి
యాదాద్రి భువనగిరి

బుధవారం ׀ 5 ׀ ఏప్రిల్ ׀ 2023



పథకాలను ప్రచారం చేయాలి

రాష్ట్ర పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు.

- 9లో



బీఆర్ఎస్ ఎజెండానే వ్యవసాయం

బీఆర్ఎస్ ఎజెండానే వ్యవసాయమని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు.

- 10లో

గరిష్టం/కనిష్టం
37°/24°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

దళితబంధుపై డాక్యుమెంటరీ చిత్రీకరణ



డాక్యుమెంటరీ చిత్రీకరణలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, లబ్ధిదారులు తదితరులు

తుర్కపల్లి : ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రిలో దళితబంధు పథకంపై మంగళవారం డాక్యుమెంటరీని చిత్రీకరించారు. దళితబంధు పథకం రాకముందు వారి జీవితాలు ఏవిధంగా ఉన్నాయి.. పథకం వచ్చాక వచ్చిన మార్పుపై లబ్ధిదారులను ఇంటర్వ్యూ చేశారు. వారి జీవనస్థితి గతులను చిత్రీకరించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, సర్పంచ్ పోగుల ఆంజనేయులు, కెమెరామెన్ శివ, కార్యదర్శి శ్రీనివాస్, దళితబంధు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు



చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ వద్ద ట్రైనీ ఐపీఎస్ అధికారులతో సీఐ మల్లిఖార్జున్‌రెడ్డి

చౌటుప్పల్ : చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌ను నలుగురు సభ్యులు గల ట్రైనీ ఐపీఎస్ అధికారులు మంగళవారం సందర్శించారు. అస్సాంకు చెందిన సౌరవ్‌కుమార్ సాయిని, చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఆకాష్ శ్రేషివాల్, ఆదిత్య పటేల్, నేపాల్‌కు చెందిన పోక్రెల్‌లు విధి నిర్వహణలో భాగంగా ఇక్కడికి వచ్చారు. స్టేషన్‌లో కేసుల నిర్వహణ, ఇతర తీరుతెన్నులను స్థానిక సీఐ మల్లిఖార్జున్‌రెడ్డి వారికి వివరించారు. అదేవిధంగా పిటిషనర్లతో కూడా మాట్లాడారు.

నష్టపరిహారం అందించాలి

భువనగిరిటౌన్: బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా బీఎన్‌తిమ్మాపురంలో ముంపు ఇళ్లకు నిర్ధారించిన విలువలో అవకతవకలు జరిగాయని, వాటిని సరిచేసి నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్‌తివారీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో స్ట్రక్చర్ వ్యాల్యూ నిర్ధారించడంలో అధికారులు అలసత్వం వహించారని, తద్వారా పరిహారం చెల్లింపులో బాధితులకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. నృసింహ రిజర్వాయర్ నిర్వాసితుల పరిహారం పరిహాసంగా మారిందన్నారు. నష్టపరిహారం సరిచేయకపోతే ఆందోళనకు దిగుతామని తెలిపారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామికి భక్తులు మొక్కుకొని పూజలు చేశారు. ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు, సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం విశేషంగా నిర్వహించారు.

రెండో రోజు 16 మంది విద్యార్థులు గైర్హాజరు

భువనగిరి : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 9.30 నుంచి 12.50 గంటల వరకు హిందీ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 8,968 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8,952 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు.

‘ఫిల్టర్’ నీటికే మొగ్గు

మిషన్ భగీరథ నీరు తాగేందుకు అనాసక్తి

- ప్రైవేట్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్న జనం
- గృహ అవసరాలకు మాత్రమే వినియోగం
- తాగునీటి కోసం జిల్లా వ్యాప్తంగా రూ.లక్షల్లో ఖర్చు



భువనగిరిలో వాటర్ క్యాన్లను తరలిస్తున్న ఆటో



అడ్డగూడూరులో ప్లాంట్ వద్ద నీటిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్న గ్రామస్తులు

భువనగిరి: రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగు నీరు సరఫరా చేస్తోంది. పలు చోట్ల గృహ అవసరాలకు వాడే నీటి పైప్‌లైన్‌తోపాటే భగీరథ నీరు సరఫరా అవుతుండడం, మరికొన్ని చోట్ల కలుషితంగా వస్తుండడంతో ప్రజలు తాగడం లేదు. మిగతా చోట్ల పూర్తిస్థాయిలో భగీరథ నీరు సరఫరా అవుతున్నా రకరకాల అపోహల కారణంగా ఫిల్టర్ చేసిన నీటినే కొనుగోలు చేసుకుని తాగుతున్నారు. కొంతమంది ఆయాగ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాంట్ల వద్ద నీటిని తెచ్చుకుంటుండగా మరికొంత మంది ప్రైవేట్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. భగీరథ నీటిని కేవలం గృహ అవసరాలకే వినియోగిస్తున్నారు.

❖ భువనగిరి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో కొనుగోలు చేసిన నీటిని మాత్రమే తాగుతున్నారు. పట్టణంలో సుమారుగా 13 వేల ఇళ్లు ఉన్నాయి. మున్సిపాలిటీ వ్యాప్తంగా ప్రతినెలా రూ. 20లక్షల వరకు తాగు నీటికే ఖర్చు అవుతుందని అంచనా.

❖ భువనగిరి మండల వ్యాప్తంగా 12వేల ఇళ్లు ఉండగా రూ.18లక్షల వరకు తాగునీటి కొనుగోలుకే ఖర్చు చేస్తున్నారు.

❖ బీబీనగర్ మండలంలో 20వేల పైగా కుటుంబాలు ఉండగా నెలకు రూ.6లక్షలు ఖర్చవుతున్నాయి.

❖ వలిగొండ వ్యాప్తంగా 25వందల కుటుంబాలు ఉండగా ప్రతి నెలా రూ.1.50 లక్షలు ఖర్చు చేస్తున్నారు.

❖ భూదాన్ పోచంపల్లి మండలం, మున్సిపాలిటీలో 11,997 కుటుంబాలు ఉన్నాయి. ప్రతి నెలా రూ.45 లక్షల వరకు నీటి కోసం ఖర్చు చేస్తున్నారు.

ప్రత్యేక పైప్‌లైన్ వేయలేదు



“ఇంట్లో వాడుకునే నల్లా నీటి ద్వారానే మిషన్ భగీరథ నీటిని ఇస్తున్నారు. ప్రత్యేక పైప్‌లైన్ వేయలేదు. దీంతో ఎవరు కూడా ఆ నీటిని తాగడం లేదు. చాలా కాలంగా వాటర్ ప్లాంట్ వద్ద నీటిని కొనుగోలు చేస్తున్నాం. నెలకు రూ. 300లకు పైగా తాగునీటికే ఖర్చు చేస్తున్నాం.

– స్వరూప, గృహిణి, భూదాన్‌పోచంపల్లి

“ నీటిని కొనుగోలు చేస్తున్నాం

పూ్యరిఫైడ్ నీటిని ఒక్కో క్యాన్‌కు రూ. 5లకు కొనుగోలు చేసి తాగుతున్నాం. మిషన్ భగీరథ నీరు ప్రతి రోజు సక్రమంగా సరఫరా కావడం లేదు. వాటిని తాగడం లేదు. పూ్యరిఫైడ్ వాటర్‌నే తాగుతున్నాం. మాకు నెలకు తాగునీటికి రూ.150 ఖర్చవుతుంది.

– రాములమ్మ, వలిగొండ

భగీరథ నీరు సరఫరా అవుతున్నా..



నీటిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్న స్థానికుడు

చౌటుప్పల్: చౌటుప్పల్ మండలంలో 26 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలో 5గ్రామాలు ఉన్నాయి. మండలంలోని ఒక్కొక్కరికి ప్రతిరోజు 100లీటర్లు, మున్సిపాలిటీ పరిధిలో ఒక్కొక్కరికీ 135లీటర్ల చొప్పున మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుంది. పలు గ్రామాల్లో సరఫరా కావడం లేదు. సరఫరా అయిన గ్రామాల్లోనూ ఈ నీటిని తాగేందుకు ఆసక్తి చూపడం లేదు. మండలంలోని 26 గ్రామపంచాయతీలకుగాను 60వాటర్ ప్లాంట్లు, మున్సిపాలిటీ పరిధిలోని 5గ్రామాలకు సంబంధించి 21ప్లాంట్లు ఉన్నాయి. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో 10 వాటర్‌ప్లాంట్లు ఉన్నాయి. కొన్ని కుటుంబాలు తాగునీటికి రూ.4 చొప్పున నెలకు రూ.120 వెచ్చిస్తుండగా.. మరికొందరు మాత్రం నెలకు రూ.300 వెచ్చిస్తున్నారు. మొత్తంగా మండల వ్యాప్తంగా సుమారుగా 10వేల కుటుంబాలు వాటర్‌ప్లాంట్ల ద్వారా మంచినీటి కోసం సరాసరిన ప్రతిరోజు రూ.30వేల వరకు ఖర్చు చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 8,038 నివాసాలకుగాను సుమారుగా 15వేల కుటుంబాలు వరకు, 1000 దుకాణాల వరకు ప్రతిరోజు వాటర్‌ప్లాంట్ల ద్వారా రూ.40వేలు, ప్రైవేట్ ప్లాంట్ల ద్వారా రూ.70వేల వరకు నీటి కోసం ఖర్చు చేస్తున్నాయి.

❖ రామన్నపేటలోని మేజర్ పంచాయతీల్లో 2నుంచి 4ప్లాంట్లు ఉన్నాయి. మిగిలిన గ్రామాల్లో గ్రామానికి ఒకటి చొప్పున ఉన్నాయి. మొత్తం 30కిపైగా పూ్యరిఫైడ్ ప్లాంట్లు ఉన్నాయి. రోజుకు 8వేల క్యాన్ల వరకు తాగునీటిని విక్రయిస్తున్నారు. పోతుంది. 20లీటర్ల నీటిని రూ.10లకు అమ్ముతున్నారు.

❖ అడ్డగూడూరు మండలంలో 17గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పాత ట్యాంకులకు భగీరథ నీరు కలిపి పంపిస్తుండడంతో ఈ నీటిని తాగేందుకు ప్రజలు ఇష్టపడడం లేదు. అన్ని గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఒక్కో ప్లాంట్‌లో 500 నుండి 100 లీటర్ల వరకు నీటిని విక్రయిస్తున్నారు.

❖ సంస్థాన్‌నారాయణపురం మండలంలో మొత్తం 12,693 కుటుంబాలు ఉన్నాయి. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు సరఫరా జరుగుతుంది. నారాయణపురం, వావిళ్లపల్లి, జనగాం, పుట్టపాక, శేరిగూడెం, చిమిర్యాల గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశారు. మొత్తంగా 12వందల మంది వాటర్ ప్లాంట్ల వద్ద నీటిని తెచ్చుకుంటున్నారు. మొత్తంగా నెలకు రూ.90 ఖర్చు అవుతోంది.

❖ మోత్కూర్ మండలంలోని సదర్శాపురం, పాలడుగు గ్రామాల్లో మాత్రమే మిషన్ భగీరథ నీరు తాగుతున్నారు. చాలా చోట్ల ఫిల్టర్ వాటర్ తాగుతున్నారు. మున్సిపల్ కేంద్రంలో 15వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. మొత్తం మీద ప్రతిరోజు రూ.20వేలకుపైగా వ్యాపారం జరుగుతుంది.

యాదగిరిగుట్టలో..



ఆత్మకూరు(ఎం) లో తాగునీటిని కొనుగోలు చేస్తున్న మహిళ

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో 25,500 జనాభా ఉండగా.. 5,500 నివాస గృహాలు ఉన్నాయి. 6లక్షల లీటర్ల మిషన్ భగీరథ నీటిని రోజు విడిచి రోజు వార్డుల్లో సరఫరా చేస్తున్నారు. మరో 8 లక్షల లీటర్ల వరకు నీరు అవసరం ఉంది. దీంతో ప్రజలు పట్టణంలో ఉన్న సుమారు 40 వాటర్ ప్లాంట్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. 5,500 గృహాల్లో సుమారు 500 కుటుంబాలు వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేసుకోగా.. మరో 1,500 కుటుంబాలు మున్సిపాలిటీ వాటర్ ఫిల్టర్ల ద్వారా, 3,500 కుటుంబాలు ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన ప్లాంట్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. సగటున యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో రూ.15,82,500లను నీటి కోసం ఖర్చు చేస్తున్నారు. యాదగిరిగుట్ట మండలంలోని 23 గ్రామాల్లో 32 వాటర్ ఫిల్టర్లు ఉన్నాయి. మండల వ్యాప్తంగా నీటి కోసం ప్రజలు రూ.10లక్షల 8వేలను ఖర్చు చేస్తున్నారు.

» ఆలేరు మున్సిపాలిటీలో 4,677 గృహాలు ఉన్నాయి. ఇక్కడ మిషన్ భగీరథ నీటిని వాడడం లేదు. నెలకు ఒక్కో కుటుంబం తాగునీటికి రూ.500 ఖర్చు చేస్తుంది. మొత్తంగా నెలకు రూ.23లక్షల నుంచి రూ.30వేలు ఖర్చు చేస్తున్నారు. కాగా.. మండల వ్యాప్తంగా 6,610 కుటుంబాలు ఉండగా.. 80శాతం మంది ఫిల్టర్ వాటర్‌కు రూ.7,93,200లను ఖర్చు చేస్తున్నారు.

» బొమ్మలరామారం మండలంలో 34 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 7,500 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామపంచాయతీలకు చెందిన బోరు వాటర్‌ను కలుపుకొని భగీరథ నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. దీంతో ఈ నీటిని ప్రజలు తాగడం లేదు. మండలంలో 35 వాటర్ ఫిల్టర్లు ఉన్నాయి. సుమారు రూ.9లక్షల 75వేలను ఆయా కుటుంబాలు నీటి కోసం ప్రతి నెలా ఖర్చు చేస్తున్నాయి.

» ఆత్మకూరు(ఎం) మండలంలో 32వేల జనాభా ఉంటుంది. 9,552 కుటుంబాలు ఉంటాయి. మిషన్ భగీరథ నీరు సరిగ్గా రాకపోవడంతో క్యాన్‌కు రూ.15లు వెచ్చిస్తున్నారు. మండల వ్యాప్తంగా వాటర్ ఫిల్టర్ల ద్వారా ప్రతి నెలా ప్రజలు రూ.4,50,000 ఖర్చు చేస్తున్నారు.

ఇంట్లోనే ఫిల్టర్ పెట్టుకున్నాం



“భగీరథ నీరు కలుషితమై వస్తున్నాయి. శుద్ధి చేసిన నీటిని తాగడానికి రూ.8వేలు ఖర్చు చేసి ఇంట్లోనే మినీ వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసుకున్నాం. రోజు రూ.5 ఖర్చు చేసి నీరు కొనుగోలు చేసుకునే కంటే వాటర్ ఫిల్టర్ పెట్టుకున్నాం.

– సిద్దులు, మహబూబ్‌పేట, యాదగిరిగుట్ట

వారానికోసారి వస్తున్నాయి



“మిషన్ భగీరథ నీరు వారానికి ఒక మారు వస్తున్నాయి. అవి సరిపోవడం లేదు. క్యాన్‌కు రూ. 15 పెట్టి పూ్యరిఫైడ్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నాం. భగీరథ నీటిని వాడుకోవడానికి ఉపయోగిస్తున్నాం.

– బద్దుల రేణుక, కప్రాయపల్లి, ఆత్మకూరు(ఎం)

» రాజాపేట మండల వ్యాప్తంగా 39వేల జనాభా ఉంటుంది. సుమారు 10వేల కుటుంబాలు ఉంటాయి. వాటర్ ఫిల్టర్లు 28 ఉన్నాయి. మండల వ్యాప్తంగా ప్రతి నెలా రూ.1,50,000 తాగునీటికి ఖర్చు చేస్తున్నారు.

» మోటకొండూర్ మండలంలో 18 గ్రామపంచాయతీలు ఉండగా.. 6 వాటర్ ఫిల్టర్లు ఉన్నాయి. ప్రతి నెలా నీటి కోసం రూ.3లక్షలు వెచ్చిస్తున్నారు.

» గుండాల మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా.. 9,996 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ 25 వాటర్ ఫిల్టర్లు ఉన్నాయి. మండల వ్యాప్తంగా ప్రతి నెలా రూ.2లక్షల 40వేలను నీటి కోసం ఖర్చు చేస్తున్నారు.

‘మునుగోడు’కు వంద పడకల ఆస్పత్రి

- ప్రభుత్వం నుంచి జీఓ విడుదల
- రూ.36 కోట్ల బడ్జెట్ కేటాయింపు



మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా జీఓ కాపీ అందుకుంటున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్: మునుగోడు నియోజకవర్గానికి 100 పడకల ప్రభుత్వాస్పత్రి మంజూరైంది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి జీఓ విడుదలైంది. ఆస్పత్రి నిర్మాణానికి రూ.36కోట్ల బడ్జెట్ సైతం కేటాయించింది. జీఓ కాపీని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. కాగా.. మంజూరైన ఆస్పత్రి నియోజకవర్గంలోని ఏ మండలంలో ఏర్పాటు చేసే విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉప ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల పక్షాన జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఏ మండలంలో ఆస్పత్రి ఏర్పాటు చేయాలనేది మంత్రి హరీశ్‌రావు తెలియజేస్తారని తెలిపారు.

8న ఎయిమ్స్‌కు ప్రధాని శంకుస్థాపన

- హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా భూమి పూజ చేయనున్న మోదీ
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఇప్పటికే శరవేగంగా నిర్మాణ పనులు

- వివరాలు 10లో▸



సంస్థాన్ పీహెచ్‌సీకి జాతీయ గుర్తింపు

- సంస్థాన్ నారాయణపురం పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ ధ్రువీకరణ
- కేంద్రం నుంచి అందనున్న ప్రత్యేక నిధులు
- ఇంకా మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం



పీహెచ్‌సీ భవనం లోపలి భాగం



వివరాలు సేకరిస్తున్న సర్వే బృందం (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు, రోగులకు నాణ్యమైన వైద్యం అందించినందుకుగాను సంస్థాన్ నారాయణపురం పీహెచ్‌సీకి నేషనల్ హెల్త్ మిషన్ కింద నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) గుర్తింపు లభించింది. నేషనల్ హెల్త్ మిషన్ అదనపు కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ రోలీసింగ్ రాష్ట్రంలో 4 పీహెచ్‌సీలకు గుర్తింపు ఇవ్వగా, అందులో యాద్రాది భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం పీహెచ్‌సీ ఉంది. ఈ గుర్తింపుతో పీహెచ్‌సీకి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఇంకా మెరుగైన సౌకర్యాలతో పాటు, వైద్యసేవలు అందనున్నాయి. కాగా.. ఈ గుర్తింపు సంవత్సర కాలం పాటు ఉంటుంది.

పలు అంశాలకు స్కోరింగ్..

ఎన్‌క్యూఏఎస్ క్వాలిటీ బృందం గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో సర్వే నిర్వహించింది. అందులో భాగంగా సంస్థాన్ నారాయణపురం పీహెచ్‌సీలో సర్వే నిర్వహించి, సౌకర్యాలు, రోగులకు అందుతున్న సేవలతో పాటు పలు అంశాలలో చెక్‌లిస్ట్ విధానంలో పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది, రోగులతో మాట్లాడి అనేక అంశాలు సేకరించారు. సేకరించిన అంశాలతో పాటు సర్వే చేసిన అంశాలకు స్కోరింగ్ ఇచ్చారు. సంస్థాన్ నారాయణపురం పీహెచ్‌సీకి 81.3 శాతం స్కోర్ సాధించింది.

నాణ్యమైన సేవలు...

పీహెచ్‌సీలో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నారు. రోజుకు 100 నుంచి 130 మందికి ఓపీ సేవలు నిర్వహిస్తున్నారు. నెలలో కనీసం 5 సాధారణ ప్రసవాలు చేస్తున్నారు. రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుతున్నారు. పీహెచ్‌సీలో ఖాళీ పోస్టులు కూడా లేవు. ప్రస్తుతం కంటి వెలుగు నడుస్తుండడంతో ఒక వైద్యుడిని డిప్యూటేషన్‌పై పంపించారు.

మా సేవలకు గుర్తింపు దక్కింది



“పీహెచ్‌సీలో మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేశాం. రోగులకు నాణ్య మైన సేవలు అందిస్తున్నాం. మా సేవలకు గుర్తింపు దక్కింది. కలెక్టర్, డీఎంహెచ్‌ఓ ప్రోత్సాహం, వైద్యులు, సిబ్బందితో కలిసి యూనిట్‌గా కష్టపడ్డాం. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు మా వంతుగా కష్టపడుతుంటాం.

– యశోద, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

మెరుగైన సౌకర్యాలు..

పీహెచ్‌సీలో మెరుగైన, నాణ్యమైన మౌలిక సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. చెట్లు, మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. పరిసరాల పరిశుభ్రత, డ్రెయినేజీ, తాగునీరు, ఫర్నిచర్‌తో పాటు రికార్డులు, డ్రగ్స్ (టాబ్లెట్లు), వ్యాక్సినేషన్ స్టోరేజీ, అగ్నిమాపక పరికరాలు, పలు సౌకర్యాలను ఏర్పాటు చేశారు. డెలివరీ గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతున్నారు. కాగా.. బ్యాక్ బ్యాటరీ, శాశ్వత డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం లోపాలుగా ఉన్నాయి.

వచ్చే నెల నుంచి ఫోర్టిఫైడ్ రైస్

- రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

సాక్షి, యాదాద్రి: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు అత్యంత పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ రైస్ (బలవర్ధక బియ్యం)ను ప్రభుత్వం సరఫరా చేయనుంది. ఈ నెల నుంచే సరఫరా చేయాల్సి ఉన్నా గోదాంలలో ఉన్న బియ్యం నిల్వలతో అది సాధ్యం కాకపోవడంతో మే నుంచి అందించనున్నట్లు పౌరసరఫరాల అధికారి తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో ఇప్పటికే పలు జిల్లాల్లో అమలు చేసి మంచి ఫలితాలను రాబట్టడంతో మన జిల్లాను కూడా ఎంపిక చేశారు. కాగా.. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలకు మధ్యాహ్న భోజనం కోసం ఫోర్టిఫైడ్ రైస్ సరఫరా జరుగుతోంది. ఈ రైస్ కోసం జిల్లాలోని మిల్లుల్లో ప్రత్యేక యంత్రాలను బిగించారు. ఇక మీదట జిల్లాలోని 515 రేషన్ దుకాణాల ద్వారా ఆహార భద్రత కార్డులు కలిగిన లబ్ధిదారులకు సాధారణ బియ్యంలో పోర్టిఫైడ్ రైస్‌ను కలిపి అందించనున్నారు.

నిపుణుల సిఫార్సుల మేరకు..

ఫోర్టిఫైడ్ రైస్‌తో అనేక లాభాలున్నాయన్న నిపుణుల సిఫార్సుల మేరకు పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరోనా తర్వాత పలు రకాల అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు ఆరోగ్యాన్ని పెంచడం దీని ప్రధాన ఉద్దేశ్యం. ఇందులో ఉండే ఐరన్‌తో రక్త హీనత తొలగించడం, అలసట తగ్గుతుంది. పోలిక్ యాసిడ్ శరీరంలో తగిన మోతాదులో రక్తం ఉత్పత్తి కావడానికి సహకరిస్తుంది. విటమిన్ బి- 12, మెదడు, నాడీ వ్యవస్థను సక్రమంగా పనిచేయిస్తుంది. నరాల బలహీనత, తక్కువ బరువుతో శిశువుల జననం, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావు.

రేషన్ దుకాణాలు	515
ఆహార భద్రత కార్డులు	2,03,335
యూనిట్లు	6,25,522
అంత్యోదయ కార్డులు	13,659
యూనిట్లు	35,828
మొత్తం కార్డులు	2,16,994
మొత్తం యూనిట్లు	6,61,350

ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా

జిల్లాలో ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజనం కోసం పోర్టిఫైడ్ రైస్ గత సంవత్సరం నుంచే సరఫరా చేస్తున్నారు. పౌరసరఫరాల అధికారులు ఇందుకోసం రైస్ మిల్లుల్లో ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేయించారు. అయితే సాధారణ బియ్యంలో పోషకాలను కలుపుతారు. ఐరన్ (ఫెర్రిక్ పైరోపాస్పెట్) 28 మిల్లీ గ్రాముల నుంచి 42.5 మిల్లీ గ్రాముల వరకు, సోడియం ఐరన్(సోడియం పెరెడిటేట్) 14 మిల్లీ గ్రాముల నుంచి 21.25 మిల్లీ గ్రాములు,పోలిక్ యాసిడ్ 75 మిల్లీ గ్రాములనుంచి125 మిల్లీ గ్రాములు, బీ-12 కోసం హైడ్రాక్సైడ్ బాల్మెన్, లేదా క్యానోకోబాల్మెన్ కలుపుతారు. వీటితోపాటు విటమిన్-ఏ, విటమిన్ బీ-6 పోషకాలు, థయామిన్, రైబోఫ్లెవిన్, నియాసిన్‌ను కలుపుతారు.

లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ

భువనగిరిటౌన్ : గొర్రెల పంపిణీ పథకంలో లబ్ధిదారుల వాటా గురించి అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ పశువైద్య అధికారులకు సూచించారు. జిల్లాలో చేపట్టబోయే రెండో విడత గొర్రెల పంపిణీ సన్నద్ధతకు మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన పశువైద్య అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రెండో విడతలో 15,392 యూనిట్లను కొనుగోలు చేయాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో జిల్లా పశువైద్య సంవర్థక అధికారి డాక్టర్ వి.కృష్ణ, సహాయ సంచాలకులు డాక్టర్ ఐలయ్య, డాక్టర్ సంజీవరావు, డాక్టర్ మోతీలాల్ పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

బీబీనగర్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. బీబీనగర్‌లోని జిల్లా పరిషత్, కిడ్స్ కింగ్ డమ్ పాఠశాలల్లో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. పలు కేంద్రాల్లో విద్యార్థులు ఉక్కపోతకు గురవుతున్నారని, ఫ్యాన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ నారాయణరెడ్డిని ఆదేశించారు. అనంతరం మహిళా ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. రాఘవాపురంలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీవాణి, డీఈఓ నారాయణరెడ్డి, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

వలిగొండ : గుర్తుతెలియని రైలు నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని నాతాళ్లగూడెంలో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. నాతాళ్లగూడెం సమీపంలోని రైల్వే ట్రాక్ పై ఒడిశాకు చెందిన ప్రదీప్ గౌడ (35) రాత్రి సమయంలో గుర్తుతెలియని రైల్ నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు.ఉదయం రైల్వే లైన్ వెంట వెళుతున్న సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే సీఐ పవన్ ఇంగ్లే తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

మిర్యాలగూడ టౌన్ : అనుమానాస్పద స్థితిలో రైతు మృతిచెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ మండల పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం జాలుబావితండాకు చెందిన భూక్య నాగు(48) సోమవారం రాత్రి పొలం వద్దకు అని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా కూడా ఆచూకీ తెలియలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఉదయం పొలం వద్దకు వెళ్లగా సమీపంలోని జంజిరాల కుంటలో విగతజీవుడిగా కనిపించాడు. కాగా, ఈ ఆలగడప చెరువు సొసైటీలో అంతర్గత పోరు ఉండటంతో రాత్రికి రాత్రి ఎవరికి వారు చేపలు పట్టుకుంటున్నారు. నాగు పొలం వద్దకు వెళ్లేటప్పుడు హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా మృతదేహం మొత్తం ఒడ్డున ఉండగా కాళ్లు మాత్రమే నీటిలో ఉన్నాయి. కాగా నాగు ఒంటిపై బట్టలు లేకపోవడంతో మరింత అనుమానాలకు దారి తీస్తుంది. నాగును హత్య చేసి ఒడ్డుకు తీసుకవచ్చి పడవేశారని భార్య రంగమ్మ ఆరోపిస్తోంది. ఘటన స్థలాన్ని మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరమ్మకాలనీకి చెందిన విజయనగరం వెంకటేశ్వర్లు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం మూడు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. దీంతో దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచిన నాలుగు తులాల బంగారం, ఎనిమిది తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. మంగళవారం సాయంత్రం బాధితుడి వియ్యంకుడు వెంకటేశ్వర్లు ఇంటిని పరిశీలించగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు వన్ టౌన్ సీఐ రాఘవేందర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శాంతినగర్‌లో...

పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్న అలుగుబెల్లి వెంకన్న ఇంట్లో సోమవారం అర్ధరాత్రి సమయంలో అంతా నిద్రిస్తున్న సమయంలో కిటికీ తెరిచిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బ్యాగులో దాచిన రూ.4వేల రూపాయలను చోరీ చేశారు. ఉదయం లేచిన వెంకన్న కిటికీ తొలగించి ఉండటాన్ని గమనించాడు. చోరీ జరిగిందని గుర్తించి టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు.

అకాల వర్షం.. అపార నష్టం

- నేలవాలిన వరిచేలు
- ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం రాశులు
- రాలిన మామిడి, బత్తాయి కాయలు



కురంపల్లి ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులు

కనగల్: కనగల్ మండలంలోని పలు గ్రామాల్లో పది రోజుల వ్యవధిలో నాలుగు సార్లు గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అకాల వర్షానికి చేతికి వచ్చిన వరిపంటలు నేల కొరిగాయి. పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఇప్పటికే నిమ్మ, మామిడి, బత్తాయి చెట్లు ఈదురుగాలుల బీభత్సానికి కూకటి వేళ్లతో సహ నేలన పడ్డాయి. కాయలు పూర్తిగా రాలిపోయాయి. మామిడి కాయలు రాలాయి. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. కనగల్ మండల వ్యాప్తంగా ప్రధానంగా యాసంగి సీజన్‌లో వరిపంటనే సాగుచేస్తారు. చేతికి వచ్చిన పంటలు ఆకాల వర్షం కారణంగా నష్టం జరగడంతో రైతులకు దుఃఖమే మిగిలింది. ఇక మిగిలింది కన్నీళ్లే అని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కల్లాల్లో తడిసిన ధాన్యం

అకాల వర్షాలతో పంటలు నేలకొరిగి, గింజలు రాలడంతో దిగుబడి తక్కువ వచ్చిందని అనుకున్న క్రమంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు చివరికి ఐకేపీ కేంద్రాల్లో పోసిన ధాన్యం కూడా తడిసి ముద్దయింది. తంటాలు పడి ధాన్యం కేంద్రాల్లో నిలిచిన నీటిని బయటకు తీసేందుకు రైతులు నానా కష్టాలు పడాల్సి వచ్చింది.

వరిచేలు నేలవాలాయి



"మండలంలోని కురంపల్లి, రాంచంద్రపురం, రేగట్టే, శాబ్దుల్లాపురం, పాపాట్లవాయి, లింగాలగూడెం, పొనుగోడు, చర్లగౌరారం, మంచినీళ్లబావి గ్రామాల్లో ప్రధానంగా వరి పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాము. ఈ గ్రామాల్లో ఈదురుగాలలు వర్షానికి కారణంగా వరిపంటలు నేలకొరిగి 30శాతానికి పైగా గింజలు రాలాయి.

– బెజవాడ అమరేందర్‌గౌడ్, మండల వ్యవసాయాధికారి

ఆత్మకూరు (ఎం)లో ..



ఆత్మకూరు(ఎం)లో కూలిన చెట్టు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో పలు చోట్ల రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలాయి. మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కరెంట్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పారుపల్లిలో పౌల్ట్రీఫారాల పైకప్పు కూలిపోయాయి. పలు గ్రామాల్లో వడ్లు రాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ జయమ్మ ఆదేశం మేరకు ఆర్ఐ చిప్పలపెల్లి యాదగిరి సందర్శించి జరిగిన నష్టాన్ని పరిశీలించారు.



పారుపల్లిలో గాలులకు కూలిపోయిన కోళ్లఫారం షెడ్డు, చనిపోయిన కోళ్లు

మోటకొండూరులో..

మోటకొండూర్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలో రైతు సింగిరెడ్డి ఎల్లారెడ్డి పశువుల పాక రేకులు లేచిపోయాయి. అలాగే వరి చేను చేతికందే సమయానికి కురిసిన వాన ఈదురు గాలులకు నేల రాలాయి.



గాలులకు లేచిపోయిన పశువుల పాక

రాజాపేటలో..

రాజాపేట: మండలంలోని బొందుగుల, సోమవారం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వడగండ్ల వర్షం కురిసింది. ఈదురుగాల బీభత్సానికి మామిడి కాయలు రాలిపోగా వరిచేలు నేలవాలాయి.



బొందుగులలో రాలిన మామిడి కాయలు

మోత్కూరులో..

మోత్కూర్ : మోత్కూర్ మండలంలో మంగళవారం భారీ ఈదుల గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఇళ్ల పైకప్పులు లెచిపోయాయి. మామిడి కాయలు నెల రాలయి. చెట్లు విరిగి పడటంతో సుమారు 100 కరెంటు స్తంభాలు విరిగిపోయాయి. మున్సిపల్ కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. మోత్కూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది.



మోత్కూరులో ఈదురుగాలుకు లేచిపోయిన ఇంటి పైకప్పు

హాలియాలో భారీ వర్షం

హాలియా : అనుముల మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలతో కూడిన భారీ వర్షం పడింది. ఈదురుగాలుల బీభత్సానికి పట్టణంలోని ఆరవ వార్డులో వర్ర సిద్దారెడ్డికి చెందిన ఐస్ ప్యాక్టరీ పైకప్పు రేకులు గాలికి ఎగిరిపడి పగిలిపోయాయి. దీంతో బాధిత కుటుంబానికి సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాట్టిలింది. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ గౌనీ సుధారాణి, గౌనీ రాజారమేష్ యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



హాలియాలో ఈదురు గాలులకు లేచిపోయిన ఐస్ ఫ్యాక్టరీ పైకప్పు

గుర్రంపోడులో వడగండ్ల వాన



పిట్టలగూడెంలో నేలమట్టమైన డైయిరీ ఫామ్



కొప్పోలులో గోడ కూలి మృతిచెందిన దూడలు

గుర్రంపోడు : గుర్రంపోడు మండలంలో మంగళవారం సాయంత్రం గాలిదుమారంతోపాటు కురిసిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. గుర్రంపోడు, కొప్పోలు, ఆమలూరు, పిట్టలగూడెం, నడికూడ, బొల్లారం తదితర గ్రామాల్లో తీవ్ర ఆస్తి, పంట నష్టం జరిగింది. పిట్టలగూడెంలో కేసాని యాదగిరిరెడ్డి డెయిరీ ఫామ్ నేలమట్టమై 15 లక్షల ఆస్తినష్టం జరిగింది. గ్రామంలోని నిమ్మ తోటలు నేలకొరగడం, బత్తాయి పిందెలు రాలడం, కూరగాయల పందిళ్లు దెబ్బతిన్నారయి. కొప్పోలులో బైరవొని నగేష్‌కు చెందిన రెండు దూడలు గోడ కూలి చనిపోయాయి. ఇదే గ్రామంలో రుద్రాక్షి లావణ్యపై రేకులు పడి చేయి విరిగింది. ఆయా విద్యుత్ స్తంభాలు విరిగిపడి సరఫరా నిలిచిపోయింది. ఒక్క కొప్పోలు గ్రామంలోనే 20 విద్యుత్‌స్తంభాలు విరిగిపోయా యి. నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై చెట్టు కూలిపోవడం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొప్పోలు గ్రామంలోబా, దిత కుటుంబాలను ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు పరామర్శించారు.



బొల్లారంలో రాలిన బత్తాయి కాయలు

అంధకారంలో పలు గ్రామాలు

విద్యుత్ స్తంభాలు విరిగిపడి కొప్పోలు, పిట్టలగూడెం, నడికూడ, బొల్లారం, ఆమలూరు తదితర గ్రామాల్లో విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. 11 కేవీ విద్యుత్ లైన్ తీగలు కూడా పడటంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ సాధ్యపడలేదు.

అడ్డగూడూరులో..



అడ్డగూడూరులో వర్షానికి తడిసిన ధాన్యం

అడ్డగూడూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులు, వడగండ్ల వర్షం బీభత్సం సృషించింది. మండల కేంద్రంలో బుట్టి యాదయ్యకు చెందిన 13ఎకరాలు మామిడి తోటలో కాయలు నేలరాలాయి. గుట్టుసింగారం గ్రామంలో సాకేతపురం భిక్షం, కదారి శోభకు చెందిన నాలుగు మేకలపై వేపచెట్టు మీద పడటంతో మృతి చెందాయి. మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.



రాలిన మామిడికాయలు

నాగారంలో..

నాగారం: మండలంలో మంగళవారం రాత్రి అకాల వర్షాంతో పాటు, భారీ ఈదురు గాలులు వీచాయి. ఈదురు గాలులకు డి.కొత్తపల్లిలో గ్రామంలో మర్రిపల్లి సాయిలు, తొడుసు శ్రావణ్‌కుమార్, కాసం భద్రయ్యల ఇంటి పైకప్పులు లేచిపోయాయి. గైగుళ్ల రామలింగయ్య ఇంటి ఆవరణలో చెట్టు కూలి దూడ మృతి చెందింది. అలాగే మాచిరెడ్డిపల్లి గ్రామంలో చెట్టుకూలి ఇంటి పైకప్పుపై పడటంతో ఈదుల నరసింహ పెంకుటిళ్లు ధ్వంసమైంది. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బోర్డులు ఈదురు గాలులకు కూలిపోయాయి. మండలంలోని ఫణిగిరి, ఈటూరు తదితర గ్రామాల్లో వరిచేలునేలకొరిగాయి.



మాచిరెడ్డిపల్లిలో ఇంటిపై కూలిన చెట్టు

వెదిరె, రావి విగ్రహాలు ఏర్పాటు చేయాలి

- మంత్రికి వినతిపత్రం అందజేసిన వెదిరె రామచంద్రారెడ్డి, రావి నారాయణరెడ్డి వారసులు



మంత్రి జగదీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వెదిరె రాంచంద్రారెడ్డి వారసులు

భూదాన్‌పోచంపల్లి : ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డితో పాటు తెలంగాణ సాయుధ పోరాటయోధుడు రావి నారాయణరెడ్డి విగ్రహాలను హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం వెదిరె రాంచంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు వెదిరె వినయ్ చంద్రారెడ్డి, డాక్టర్ వెదిరె ప్రభోద్ చంద్రారెడ్డి, వెదిరె అరవిందారెడ్డిలతో పాటు రావినారాయణరెడ్డి మనుమరాలు రావి ప్రతిభ మంత్రి జగదీష్‌రెడ్డికి హైదబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆచార్య వినోబాభావే 1951లో పోచంపల్లికి వచ్చినప్పుడు వెదిరె రాంచంద్రారెడ్డి తన వంద ఎకరాల భూమిని నిరుపేదలకు దానం చేసి భూదానోద్యమానికి బీజం వేశారని గుర్తుచేశారు. అదేవిధంగా తెలంగాణ సాయుధ పోరాటానికి సారథ్యం వహించిన రావి నారాయణరెడ్డి 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించి చరిత్రపుటలకెక్కారని అన్నారు. భవిష్యత్ తరాలకు భూదాన ప్రాశస్త్యం, తెలంగాణ పోరాట స్ఫూర్తిని అందించడానికి వారి స్మారకార్థం ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాక్టర్ బోల్తా .. డ్రైవర్‌కు గాయాలు

నాగార్జునసాగర్: ఆర్టీసీ బస్సును తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన నాగార్జునసాగర్‌లోని దయ్యాలగండి మూలమలుపు వద్ద చోటు చేసుకుంది. నాగార్జునసాగర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మాచర్లకు వెళుతుంది. రమావత్‌దస్రు(24) ట్రాక్టర్‌పై హిల్ కాలనీ నుంచి బెట్టలతండాకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో దయ్యాలగండి మూలమలుపు వద్ద బస్సు ఒక్కసారిగా దూసుకు రావడంతో దానిని తప్పించేందుకు ట్రాక్టర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి సైడ్‌వాల్‌ను ఢీకొట్టి బోల్తాకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ రమావత్ దస్రూకు గాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కలిసి ఉండండి.. కలుపుకొని పోండి



చిట్యాలలో బలగం ఫేం సుధాకర్‌రెడ్డి(కొమరయ్య)కు జ్ఞాపికను అందజేస్తున్న కేటీఎస్ యాజమాన్యం

- బలగం ఫేం నటుడు సుధాకర్‌రెడ్డి

చిట్యాల : ప్రతి ఒక్కరూ కలిసి ఉండండి.. అందరిని కలుపుకోని పోండి అనే విధానంలో జీవనాన్ని కొనసాగించినప్పుడే సమాజం బాగుంటుందని బలగం ఫేం నటుడు సుధాకర్‌రెడ్డి (కొమరయ్య) అన్నారు. చిట్యాలలో మంగళవారం రాత్రి కేటీఎస్ స్కూల్ గ్రాడ్యువేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన బోధన చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులు, తోబుట్టువుల పట్ల ప్రేమ ఆప్యాయతలతో మెలగాలని ఆకాంక్షించారు. సంపాదన మోజును విడనాడి బలగాన్ని పెంపొందించుకోవాలన్నారు. బలగం సినిమాలో మానవ సంబంధాలను ఎలా పెంపొందించుకోవాలనే చూపించటంతోనే సినిమా విజయం సాధించిందని ఆయన తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులకు గ్రాడ్యువేషన్ సర్టిఫికేట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతో చిన్నారులతో పాటు పెద్దలు సైతం ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో కేటీఎస్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీధర్, నగేష్, హెచ్ఎం బోడ్డు యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

- అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 9115551443. [T-03]

డాక్యుమెంట్స్ పోయినది

- సామల రాంరెడ్డి S/o Late రాజిరెడ్డి గ్రా॥ మన్నెవారి పంపు, మం॥ భువనగిరి, జిల్లా యాదాద్రి భువనగిరి వడపర్తి రెవెన్యూ పరిధి Sy No. 252 (1-31), 253 (1-14), 463 (0-05), Total - 3-10 డాక్యుమెంట్ నెం. 4952/1/93, డాక్యుమెంట్ నెం. 2990/87 గల డాక్యుమెంట్ మన్నెవారిపంపు నుండి భువనగిరికి వెళ్తుండగా మార్గ మధ్యలో పోయినది. దొరికినవారు సంప్ర॥ 9948777101 [Y-784254]

Wanted

- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం॥ 15000+ ఇన్సెంటివ్స్, ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795295]
- ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 90004 08325 [G-795298]
- దామరచర్ల, యాదాద్రి, థర్మల్ ప్లాంట్ పహార్‌పూర్ కూలింగ్ టవర్స్ వర్కర్స్ కావలెను. హెల్పర్స్, కార్పెంటర్స్, రాడ్‌బెండర్స్ కావలెను. సంప్ర॥ 7799542599, 8469582855 [Y-784210]
- TATA SKY, DTH & VODAFONE IDEA నల్లగొండ మరియు మిర్యాలగూడలో పనిచేయుటకు సేల్స్ ప్రమోటర్స్ & టెలికాలర్స్ కావలెను. సంప్ర॥ 9676929505 [Y-784331]
- అతి తక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 77308 99503 [G-536]
- యాదగిరిగుట్ట - చెల్లూరులో డైరీ ఫామ్ లో పనిచేయుటకు లేబర్స్ కావలెను. జీతం + వసతి ఇవ్వబడును. సంప్ర. ఫోన్ : 7675920584, 9063882711 [HA-12]
- Wanted Teachers (CBSE), NEET & JEE Faculty, Sal: 12-15 Lakhs, Exp. Candidates, Send C.V. info@dheeranchinnamalaischool.ac.in, Dheeran Chinnamalai School & Academy, Krishnagiri (Dist),Tamilnadu, 9442882228. [T-1201063]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పులి పిల్లల కోసం అటవీ అధికారుల ఆరా

నల్లగొండ రూరల్ : పులి పిల్లల కోసం అటవీ శాఖ అధికారులు మంగళవారం నల్లగొండ మండలంలోని చందనపల్లిలో ఆరా తీశారు.సోమవారం చందనపల్లిలో చిరుతపిల్లల సంచారం వార్తపై అధికారులు స్పందించారు. అటవీ శాఖ అధికారులు చెత్త డంపింగ్ యార్డు వెనుక ప్రాంతంలో ,రైతు సేవా కాల్వ పరిసరాల్లో అన్వేషించారు.గ్రామస్తుల నుంచి సమాచారం రాబడుతున్నామని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు అటవీ అధికారి కెఎస్ రెడ్డి తెలిపారు. పులి పిల్లలు తిరిగాయని చెబుతున్న ప్రాంతంలో అటవీ అధికారుల పర్యవేక్షణ ఉంటుదని చెప్పారు.

దుకాణంలో రూ.70వేల నగదు చోరీ

మేళ్లచెరువు : గుర్తుతెలియని వ్యక్తులు దుకాణంలోని రూ.70వేల నగదును చోరీ చేశారు. ఈ ఘటన మేళ్లచెరువులో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు నందు రామకృష్ణ అయిల్ అండ్ జనరల్ స్టోర్‌లోకి సోమవారం రాత్రి వెనుక డోర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. షాపులో అమర్చిన సీసీ కెమారాలు ,వాటికి సంబంధించిన హార్డ్ డిస్కును, క్యాష్ కౌంటర్ లో 70 వేల రూపాయలు నగదును అపహరించుకుపోయారు. షాపు యజమాని రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో పుస్తెల తాడు అపహరణ



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో పుస్తెల తాడును అపహరించారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన చిద్రా శ్రీలక్ష్మి కిరాణం షాపును నిర్వహిస్తుంది. మంగళవారం ముగ్గరు యువకులు బైక్‌పై దుకాణం వద్దకు వచ్చారు. ముగ్గురిలో ఒక వ్యక్తి బైక్‌పై కూర్చొని ఉండగా మరో యువకుడు బాధిత మహిళను మాటల్లో పెట్టి కూల్‌డ్రింక్ ఇవ్వాలని కోరాడు. దీంతో వెనుక ఉన్న మరో యువకుడు ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని బైక్‌పై పారి పోయారు. దీంతో కంద పడిపోయిన మహిళ కేకలు పెట్టగా దుండగులు వేములపల్లి వైపు పారిపోయారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ పి.వెంకటగిరి, టూ టౌన్ సీఐ నరసింహారావుతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత మహిళ నుంచి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్ట్

- రూ.20లక్షలు విలువైన 117 కిలోల గంజాయి స్వాధీనం
- నిందితుల వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్ చిత్రంలో డీఎస్పీ



గంజాయి రవాణాకు కారులో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్స్

కోదాడరూరల్ : ఆంధ్రప్రదేశ్ నుంచి ముంబాయికి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.20లక్షల విలువైన 117.30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కోదాడ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ నిందితుల వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లాకు చెందిన సల్మాన్‌మాలిక్, అరుణ్‌లు స్నేహితులు. వీరు లారీ డ్రైవర్‌లుగా పని చేస్తున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తే వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో ఎదైనా అక్రమ వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో వారు చేపలలోడ్‌తో ఏపీలోని రాజమండ్రి వెళ్లిన సమయంలో గంజాయి వ్యాపారం చేసే చిరంజీవి గురించి తెలుసుకున్నారు. గత నెల 28న చిరంజీవిని కలిశారు. గంజాయిని రవాణా చేస్తే రూ.12వేలు ఇస్తానని అతను తెలపడంతో వారు ఆ పని చేసేందుకు ఒప్పుకున్నారు.

ఐరన్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకుని..

గంజాయి రవాణా విషయం ఎవరికీ తెలియకుండా ఉండేందుకు కారులో ప్రత్యేకంగా తయారు చేసిన ఓ ఐరన్ బాక్స్‌లను ఏర్పాటు చేశారు. వాటిని సీట్ల కింద, డిక్కీ కింది భాగంలో గుర్తించలేని విధంగా సెట్ చేసి 63 ప్యాకెట్లలో (కేజీ, రెండుకేజీల చొప్పున 63 ప్యాకెట్లలో 117.30 కేజీలను గంజాయిని పెట్టి ముంబాయికి వెళ్లమని చెప్పాడు. ముంబాయి చేరుకున్నాక ఎక్కడ ఎవరికి గంజాయిని అప్పగించాలో చెప్తానని... మాట్లాడుకున్నదానిలో రూ.6వేలను ముందుగా ఇచ్చి మిగిలిన డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పి కారులో పంపించాడు.

పోలీసులను చూసి..

రాజమండ్రి నుంచి కారులో బయలుదేరిన తర్వాత పోలీసుల కంటపడకుండా చెక్‌పోస్టులను దాటుకుంటూ వస్తున్నారు. మార్గమధ్యలోని కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్ వద్దకు రాగానే వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసిన వారు కారును వదిలిపెట్టి పారిపోయారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకొని సల్మాన్‌మాలిక్, అరుణ్‌లను రిమాండ్‌కు తరలించారు.చిరంజీవి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి కారు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.20లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్, చిలుకూరు ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది సమ్మద్, నిరంజన్, ఉపేందర్, శ్రీకాంత్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో పట్టణ శివశంకర్, మునగాల ఎస్ఐ లోకేష్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి : పట్టణంలోని 15,16,17వ వార్డులో జరుగుతున్న సీసీ, అండర్ డ్రెయినేజీ నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే పైళ్లశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ, అండర్ డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. అనంతరం కిసాన్ నగర్ నుంచి అర్బన్‌కాలనీకి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు నిర్ణయించిన మార్గాన్ని పరిశీలించారు. రోడ్డు నిర్మాణం కోసం భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు చెన్న స్వాతిమహేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గాదె శ్రీనివాస్, జంగయ్య, వినోద్‌కుమార్ ఉన్నారు.

వారాంతపు సెలవు ఇవ్వాలని వినతి

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వారాంతపు సెలవు ఇవ్వాలని కోరుతూ ఆ సంఘం అధ్యక్షుడు మాయ కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ బి.నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కార్మికులు ఒక పూట పని చేసే విధంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు కొండయ్య రాజయ్య, శంకరయ్య, శాంతమ్మ, శ్యామల, నర్సమ్మ, యాదమ్మ, లక్ష్మి ఉన్నారు.

హనుమాన్ శోభాయాత్ర కరపత్రం విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న శంకరానందా స్వామిజీ, నాయకులు

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 6న నిర్వహించే హనుమాన్ జయంతి శోభాయాత్ర కరపత్రాలను శ్రీశ్రీశ్రీ శంకరానందా స్వామిజీ మంగళవారం యువజన సంఘాల నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తిశ్రద్ధలతో హనుమాన్ వేడుకలను ఘనంగా జరుపుకోవాలన్నారు. కార్యకమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

భువనగిరిటౌన్ : యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ మంగళవారం పట్టణంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, బీసుకుంట్ల సత్యనారాయణ, బర్రె జహంగీర్, కైరంకొండ వెంకటేశం, ముచ్చల మనోజ్‌కుమార్, పడిగెల ప్రదీప్, రఘుబాబు, సుధాకర్, వినయ్, మహేందర్, శ్రీధర్, రాజు, వెంకటేష్, మధు, శరత్ తదితరులు ఉన్నారు.

పోలీసు అమరులకు ఘన నివాళులు



పోలీసు అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

ఆత్మకూరు(ఎం) : జానకిపురం ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన మండల ఎస్‌ఐ డి.సిద్ధయ్య, కానిస్టేబుల్ నాగరాజు చిత్రపటాలకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పూలమాలలు వేసి మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గర్ష కోట మధు, సిబ్బంది శ్రీనువాసరావు, సైదులు, శ్రీను, వసంతరావు, ప్రేమలత, గాయత్రి, ప్రియాంక పాల్గొన్నారు.

పలువురికి సన్మానం



సన్మానం చేస్తున్న గ్రామీణ వైద్యుల సంఘం

మోత్కూర్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, జిల్లా ఈసీ మెంబర్లను మంగళవారం మండల కేంద్రంలో మండల సుశృత గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్లు ప్రభాకర్‌రెడ్డి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, చారి, గ్రామీణ వైద్యులు సంఘం నాయకులు అశోక్, గసగాని నర్సింహాగౌడ్, నర్సింగరావు, భిక్షం, వెంకన్న, మల్లేష్, యుగేందర్, రమేష్, మధు ఉన్నారు.

రైతుల కష్టం దళారుల పాలు

- ప్రారంభంకాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- దళారులకు అమ్ముకుంటున్న రైతులు
- త్వరగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని వేడుకోలు



రామారంలో వే బ్రిడ్జి ముందు పోసిన వరిధాన్యం

గుండాల : మండల వ్యాప్తంగా వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరికోతలు ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వరిధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. గత వారం రోజులుగా కోతలు ప్రారంభమైనా జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఎక్కడా ప్రారంభించలేదు. దీంతో రైతాంగం ఆరు నెలలు శ్రమించి పండించిన పంటను తక్కువ ధరలకే దళారులకు విక్రయిస్తున్నారు. ఈనెల 15తరువాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నప్పటికీ వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగి పంట దిన దిన గండంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి వరి పంటలు నేలరాలి పోయాయి. దీంతో ఆందోళన చెందుతున్న రైతాంగం పచ్చని వరి చేలను కోస్తూ ప్రైవేట్‌కు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తున్నప్పటికీ త్వరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అతి తక్కువ ధరకే అమ్ముకొని రైతులు నష్టపోతున్నారు. పచ్చి వరి ధాన్యాన్ని దళారులు రూ.1600 నుంచి రూ.1700లకు కొనుగోలు చేస్తూ వారం రోజుల్లో డబ్బులు చెల్లిస్తుండటంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ఆశ్రయిస్తున్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులు పెద్దపల్లి జిల్లాలోని సుల్తాన్‌బాగ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు సమాచారం.

వారం రోజుల్లో డబ్బులు చెల్లిస్తున్నారు



వాతావరణంలో వస్తున్న మార్పులకు భయపడి పచ్చి వరిచేనునే కోసి ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాను. వడగండ్లు ఎప్పుడు పడతాయోననే భయంతోనే వరి పంటను కోసాం. సుమారుగా 38 క్వింటాళ్ల ధాన్యాన్ని రూ.1650లకే విక్రయించాను. కమీషన్ తీసుకొని వ్యాపారులు వారం రోజుల్లో డబ్బులు చెల్లిస్తున్నారు.

– గూడ మధు, రైతు, సుద్దాల

పునరావాసం కల్పించాలని ఆర్డీఓకు వినతి



ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న భీమనపల్లి గ్రామస్తులు

భూదాన్‌పోచంపల్లి : మండలం నుంచి వెళ్తున్న గౌరెల్లి–భద్రాచలం జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని కోరుతూ మంగళవారం మండలంలోని భీమనపల్లి గ్రామస్తులు చౌటుప్పల్ ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కంటె రాములుయాదవ్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి నిర్మాణంలో భీమనపల్లి గ్రామానికి చెందిన పలువురు తమ స్థిరాస్తులను కోల్పోతున్నారని, అందులో ఇళ్లు కోల్పోతున్న వారికి పునరావాసం కల్పించాలని, ప్లాట్లు కోల్పోతున్న వారికి వేరేచోట ప్లాట్లు కేటాయించాలని, భూములు కోల్పోతున్నవారికి నేటి మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నర్సింహ, కంటె లింగస్వామి, బుచ్చయ్య, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, పాండు, శేఖర్, రుకనమ్మ, మల్లయ్య, రవి, యాదయ్య, వెంకటేశ్, ప్రశాంత్, శ్రీకాంత్, శ్రీను, శ్రీశైలం, తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లకు పార్టీలు ప్రాధాన్యం కల్పించాలి

బొమ్మలరామారం : ముదిరాజ్‌లకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించాలని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కుషంగల సత్యనారాయణ కోరారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో మంగళవారం ముదిరాజ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముదిరాజ్‌లు ఆర్థిక స్వావలంభన సాధించే దిశగా మండల కేంద్రంలో చేపల మార్కెట్, మొబైల్ చేపరుచుల క్యాంటీన్‌లను ప్రభుత్వం అందజేయాలన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ గొడుగు శోభ చంద్రమౌళి, సంఘం మండల నాయకులు రాగుల బల్‌రాం, ఎలబోయిన రవిశంకర్, మేడబోయిన గణేష్, నరేందర్, భాను, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం అందని ఇల్లు లేదు

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆలేరు రూరల్ : బీఆర్ఎస్ ప్రభుత్వ సాయమందని గడపంటూ లేదని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. మంగళవారం ఆలేరు మున్సిపాలిటీలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు సొంత ఇల్లు ఉండాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం ప్రవేశపెట్టారని తెలిపారు. నిజమైన అర్హులకు ఇళ్ల పట్టాలను కేటాయించినట్లు చెప్పారు. ఇల్లు రాని వారు నిరాశ చెందొద్దని, త్వరలో హౌజింగ్ స్కీం వస్తుందని, సొంత స్థలం ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆలేరు మున్సిపాలిటీలో 64 డబుల్ బెడ్ రూం ఇళ్లకు 513 మంది దరఖాస్తు చేసుకున్నారని, రెవెన్యూ అధికారులతో పూర్తి విచారణ చేసి 106 మందిని తుది జాబితాగా ప్రకటించారని పేర్కొన్నారు. అందులో రిజర్వేషన్‌ల ప్రకారం డ్రా సిస్టమ్ ద్వారా ఎంపికైన వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మొరిగాడి మధవి, పుట్ట మల్లేషం, కౌన్సిలర్లు బేతి రాములు, రాయపురం నర్సింహులు, బింగి లత, బాలస్వామి, పత్తి వెంకటేష్, పంతం కృష్ణ, కుండె సంపత్, పూల శ్రవణ్, చింతకింది మురళి, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా.. కౌన్సిలర్ సమంతక డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఎమ్మెల్యేను ప్రశ్నించడానికి రాగా.. పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి గుండాల స్టేషన్‌కు తరలించారు.

వార్డుల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

చౌటుప్పల్ : మున్సిపాలిటీలోని వార్డుల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణ కేంద్రంలోని 17వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో మంగళవారం ఆయన పర్యటించి కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గుర్తించిన ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రధానంగా వార్డుల్లో డ్రెయినేజీలు, సీసీరోడ్లు, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని, ఇచ్చిన అన్ని హామీలను ప్రాధాన్యతా క్రమంలో నెరవేరుస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్, సింగిల్‌విండో చైర్మన్‌లు వెన్‌రెడ్డి రాజు, చింతల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, ప్రజారోగ్య డీఈ మనోహర, కౌన్సిలర్లు గోపగోని లక్ష్మణ్, ఎండీ.బాబాషరీఫ్, బండమీది మల్లేషం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వీరమళ్ల వెంకటేశం, సుర్కంటి నవీన్‌రెడ్డి, దండ అరుణ్‌కుమార్, ఎం.దయాకరాచారి, సుర్కంటి రాంరెడ్డి, తొర్పునూరి మల్లేశం, ఖలీల్, అతహర్, గంగరాములు, ఊడుగు రమేష్, స్వామి, శంకర్ ఉన్నారు.

బీసీలకు అన్యాయం చేసిన కేసీఆర్ ప్రభుత్వం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాల పాలనా కాలంలో బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో అన్యాయం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు ఆరోపించారు. భువనగిరి పట్టణంలోని రహదారి బంగ్లాలో మంగళవారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్లెపల్లెలో ఇంటింటికీ బీజేపీ వాల్ పోస్టర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్ రావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలను గొర్లు, బర్రెలకు మాత్రమే పరిమితం చేసిందన్నారు. రాష్ట్రంలో బీసీల రాజ్యాధికారాన్ని కాపాడుకునేందుకు డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు జిల్లా ఇన్‌చార్జ్ ఆనంద్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు గూడూ రు నారాయణరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, భిక్షమాచారి, శ్రీశైలం, నగేష్, ఉషాకిరణ్, విక్రమ్, ఉమాశంకర్‌రావు ఉన్నారు.

పదోతరగతి పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి



యాదగిరిగుట్ట : మాట్లాడుతున్న బేజాడి కుమార్

యాదగిరిగుట్ట : పదోతరగతి పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై విచారణ జరిపించి, నిందితులను కఠినంగా శిక్షించాలని పీవైఎస్ రాష్ట్ర కోశాధికారి బేజాడి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో పీవైఎస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేపర్ లీకేజీ కావడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ పరిపాలనకు నిదర్శనమన్నారు. పరీక్ష ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే పరీక్ష పత్రం లీకేజీ కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీతో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించి, విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ మండల నాయకులు ఇంజ శరత్, మేటే శ్రీకాంత్, గుల్లని బాల రాజు, రాజు, రమేష్, చరణ్, తదితరులున్నారు.

ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి

భువనగిరిటౌన్ : పరీక్ష పేపర్ల లీకేజీకి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు అక్షింతల కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పరిపాలన విభాగంలో సరియైన పర్యవేక్షణ లేకపోవడమే పరీక్ష పేపర్ల లీకేజీకి ప్రధాన కారణమని ఆయన అన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో అనేక ప్రధాన పోస్టులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చాలా మంది కాంట్రాక్టు, ఓట్ సోర్సింగ్ ఉద్యోగులు బాధ్యతారాహిత్యంగా ఉండడంతోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక నాయకులు కాచరాజు జయప్రకాశ్, ఎస్.ముత్తిరెడ్డి, వినోద్‌కుమార్, కొడారి వెంకటేష్, నర్సింహారావు తదితరులు ఉన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తేనే విజయాలు



మాట్లాడుతున్న కవి, సైకాలజిస్ట్ డాక్టర్ భాగ్యలక్ష్మి

రామన్నపేట : ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తేనే విజయాలు సాధించగలమని ప్రముఖ కవి, సైకలాజిస్ట్ మోటివేషన్ కౌన్సిలర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంజి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కక్కిరేణి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మహిళా సాధికారితపై ఏర్పాటు చేసిన మహిళా చైతన్య సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మనకు కావాల్సింది ఏదీ మన దగ్గరకు రాదని, మనమే శోధించి సాధించాలని ఆమె అన్నారు. మహిళలపై వివక్ష, మూఢనమ్మకాలు వంటి అవరోధాలను దాటుకొని అవమానాలు ఆభరణాలుగా చేసుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ పిట్ట కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రద్యుమ్నాచారి, రాజన్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, న్యాక్ ప్రతినిధి అప్రోజ్, ఎండీ నిజాముద్దిన్, సామాజిక కార్యకర్త వేముల సైదులు, న్యాక్ కన్వీనర్ మెట్టు మధు, సంఘ బంధం అధ్యక్షురాలు ప్రభావతి, వసంత, విజయలక్ష్మి, భార్గవి, లక్ష్మి, మనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

- రాజ్యసభ సభ్యుడు లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే సునీత, ఎమ్మెల్సీ, ఆత్మీయ సమ్మేళన జిల్లా ఇన్‌చార్జ్ యాదవరెడ్డి



ఎమ్మెల్యే సునీత, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నర్సింహులు, మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

యాదగిరిగుట్ట : తెలంగాణలో సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ఆత్మీయ సమ్మేళనాల జిల్లా ఇన్‌చార్జ్ యాదవరెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాదిలోనే అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయని, మరో ఆరు నెలలే సమయం ఉందని.. అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. ఏడేళ్ల కాలంలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిపై గ్రామాల్లో రచ్చబండ వద్ద, గ్రామపంచాయతీల వద్ద, పంట పొలాల వద్ద, జనాలు ఉన్న చోట పార్టీ కార్యకర్తలు, నాయకులు వివరించాలన్నారు. తెలంగాణ రాక ముందు ఉన్న పరిస్థితులు, వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధిపై ప్రజలతో చర్చించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణలో ఉన్న పథకాలు లేవని, ఇక్కడ జరిగిన అభివృద్ధి అక్కడ జరగడం లేదన్నారు. అంతకు ముందు పాత గోశాల నుంచి గుండ్లపల్లి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, పట్టణ అధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, రైతు బంధు జిల్లా డైరెక్టర్ మిట్ట వెంకటయ్యగౌడ్, మండల, పట్టణ సెక్రటరీ జనరల్స్ కసావు శ్రీనివాస్‌గౌడ్, పాపట్ల నరహరి, యూత్ పట్టణ అధ్యక్షుడు ముక్కెర్ల సతీష్, మండల యూత్ సెక్రటరీ జనరల్ బీమగాని నర్సింహాగౌడ్, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

20వ రోజుకు చేరుకున్న నిరసన దీక్ష



బస్వాపురం రిజర్వాయర్ కట్టపై దీక్ష చేస్తున్న లప్పానాయక్ తండావాసులు

యాదగిరిగుట్ట రూరల్: బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న లప్పానాయక్ తండావాసులు చేపట్టిన నిరసన దీక్ష మంగళవారం 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఇచ్చిన హామీల మేరకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, వ్యవసాయ భూములకు సంబంధించిన పరిహారం, దాతర్‌పల్లిలో లేఅవుట్ చేసి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా నిరసన చేస్తున్నా, ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేదన్నారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధీరావత్ బుజ్జి శంకర్, ఉపసర్పంచ్ మంక్యా నాయక్, బిచ్యానాయక్, రవికాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్

వలిగొండ : ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఎంపీపీ నూతి రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వడగండ్ల వర్షానికి మండల వ్యాప్తంగా 462ఎకరాల పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు గుర్తించారని, అంచనాలను క్షేత్రస్థాయిలో పూర్తి చేసి రైతులకు నష్టపరిహారం తొందరగా అందేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని పేద ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పూర్తిగా అందడం లేదన్నారు. సమావేశంలో పాశం సత్తిరెడ్డి, సామ రాంరెడ్డి, బాతరాజు బాల్‌నర్సింహ, గారిసే రవి, సంజీవరెడ్డి, సుధాకర్, కృష్ణయ్య, వెంకన్న, సాయి ఉన్నారు.

ప్రతిఒక్కరూ స్వచ్ఛత వైపు అడుగువేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ తాండ్ర అమరావతి

గుండాల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛత వైపు ప్రతి ఒక్కరూ అడుగువేయాలని ఎంపీపీ తాండ్ర అమరావతి అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘ సభ్యులు, ఈజీఎస్ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు స్వచ్ఛభారత్ మిషన్‌పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది వేరు చేసిన చెత్తతో ఎరువు తయారు చేసుకొని మొక్కలకు వేయాలని సూచించారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా మరుగుదొడ్లు వాడాలని కోరారు. గ్రామాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీనివాసులు, ఎంపీఓ పి.జనార్దన్‌రెడ్డి, ఏపీఎం అంజయ్య, ట్రైనర్ మజీద్, ఈసీ రాజశేఖర్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ

భువనగిరి : గ్రామాల అభివృద్ధే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ నరాల నిర్మలవెంకటస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని ఏటీపీతండాలో మండల పరిషత్ నిధులు రూ.8.30లక్షలతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వాటర్‌పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతావత్ చక్రి, ఎంపీటీసీ సుజాతగోవర్ధన్, ఏఈ ప్రసాద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని అనంతారం గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.9లక్షలతో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టనున్న నూతన భవన నిర్మాణానికి ఎంపీపీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బీరు మల్లయ్య, సర్పంచ్ మల్లికార్జున్, ఉపసర్పంచ్ వెంకటేష్, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



చౌటుప్పల్ : కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామన్నపేట : రాష్ట్రంలో అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని సర్నేనిగూడెంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, సర్పంచ్ ధర్నె రాణి, ఉపసర్పంచ్ మల్లెబోయిన శోభన్‌బాబు, మండల వైద్యాధికారి డాక్టర్ అశ్వినికుమార్, కార్యదర్శి ఎ.సుధ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేయకుండా కళ్లను కాపాడుకోవాలి

చౌటుప్పల్ : ప్రతిఒక్కరూ కళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి కాటంరాజు, కాలనీ అధ్యక్షుడు సుభాష్‌చారి, వైద్యులు ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

వలిగొండ : మండలంలోని అరూర్ గ్రామానికి చెందిన విగ్నేశ్వర యూత్ సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు మంగళవారం బీజేపీ జిల్లా నాయకుడు సీఎస్ రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ధనుంజయ్, చిట్టెడి అభిజిత్ రెడ్డి, బైకాని కృష్ణ, వెంకటాచారి, శ్రీనివాసచారి, ఉదేశ్, కేదారి నరేష్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లిలో బలగం సినిమా ప్రదర్శన

ఆత్మకూరు(ఎం) : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో బలగం సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆ సినిమాలో ఒక్క పాట పాడి ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించిన గాయకులు మొగిలయ్య కొమురమ్మ దంపతులను గ్రామ సర్పంచ్ గనగాని మాధవిమల్లేషంగౌడ్ ఆహ్వానం మేరకు వారు మంగళవారం సాయంత్రం గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడారు. బలగం సినిమా అనుభవాలను గ్రామస్తులతో పంచుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ వారిని ఘనంగా సన్మానించారు.

మోగిలిపాకలో..

వలిగొండ : మండలంలోని మోగిలిపాకలో స్థానిక సర్పంచ్ ముద్దసాని శశికలారెడ్డి సౌజన్యంతో మంగళవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. కార్యక్రమంలో ముద్దసాని కిరణ్‌రెడ్డి, మోగిలిపాక రమేష్, జక్క శంకరయ్య, భిక్షపతి, నర్సింహ, విష్ణుచారి, సత్తయ్య, గ్రామప్రజలు పాల్గొన్నారు.

మోడ్రన్ ధోబీఘాట్‌లు నిర్మించాలి

బొమ్మలరామారం : రజక వృత్తిదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో మోడ్రన్ ధోబీఘాట్‌లు నిర్మించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రజక వృత్తిదారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని చేతివృత్తుల వారిని ఆదుకుంటున్న ప్రభుత్వం రజకులపై చిన్నచూపు చూస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భరత్ కుమార్‌లు, జెల్లా మల్లేష్, నాయకులు ఎడీజర్ల భూపాల్, జూపల్లి లింగం, జూపల్లి జంగయ్య, శ్రీకాంత్, వెంకటేష్, చంద్రమౌళి, పాపులు, పాండు, బాల్‌రాజ్, నర్సింహ, నగేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి సర్పంచ్‌కు లేదు

యాదగిరిగుట్ట రూరల్ : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీతను విమర్శించే స్థాయి వంగపల్లి సర్పంచ్ కానుగు కవితకు లేదని ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు రేపాక స్వామి, ఎంపీటీసీ రేపాక మౌనిక అన్నారు. మంగళవారం మండలంలోని వంగపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే స్వంత ఊరైన వంగపల్లికి ఆమె ఏమి చేయలేదని, గ్రామసర్పంచ్ కానుగు కవిత చేసిన వ్యాఖ్యలు అవాస్తవమన్నారు. ఇంకోసారి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో వార్డుసభ్యులు, గ్రామశాఖ అధ్యక్షుడు అచ్చిన కృష్ణస్వామి, యూత్ మండల అధ్యక్షుడు ఎండీ అజ్జు, నాయకులు రవి, మహేందర్ ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం వాయిదా

తుర్కపల్లి : మండల కేంద్రంలో 6న నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం వాయిదా పడినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు.